జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం... ప్రజల కోసం
సిద్దిపేట
శనివారం | 18 | ఏప్రిల్ | 2026 | పేజీలు : 8

## పీఆర్సీ నివేదిక తక్షణమే వెంటనే అమలు చేయాలి

సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి

టీజీఈజేఏసి సిద్దిపేట జిల్లా కమిటీ డిమాండ్



6లో



# రోడ్డు నిబంధనలపై చైతన్యం అవసరం



### మానవ తప్పిదంతోనే రోడ్డు ప్రమాదాలు
### రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి): మానవ తప్పిదంతోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి అన్నారు.శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అరైవ్ అలైవ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రత, నియమాలు, ప్రమాదాల నిర్మూలనపై ప్రతి ఒక్కరు చైతన్యం కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించి ప్రమాదాలు అరికట్టేందుకు అరైవ్ అలైవ్ ప్రతిష్టాత్మకంగా మిగతా 2లో..

## ఉప్పరపల్లి సబ్ కెనాల్‌కు నీళ్లు రాక ఎండిన పొలాలు



6లో

# రైతు సమస్యలు పట్టని వ్యవసాయ శాఖ

### అధికారుల నిర్లక్ష్యంతో పథకాల అమలుకు బ్రేక్

### కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు



దౌల్తాబాద్, ఏప్రిల్ 17: (ప్రజా జ్యోతి) మండల వ్యవసాయ శాఖ పని తీరు రోజురోజుకూ దిగజారిపోతుండడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తిర్మలాపూర్, ముబారాస్పూర్ క్లస్టర్లలో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో లేకపోవడం, సమస్యలను పట్టించుకోకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు.వ్యవసాయ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని రైతులు మిగతా 2లో..

## రైతులకు ఇబ్బంది కలగొద్దు



చిన్నకోడూరు, ఎప్రిల్17,(ప్రజా జ్యోతి): పొద్దుతిరుగుడు పంట కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నాయకుడు రాజేశ్వర్ రెడ్డి అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట అమ్మకం విషయంలో ఎక్కువసేపు వేచిచూడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఆయన వెంట కుండె తిరుపతి, బట్టు వంశీ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన చైర్మన్




చిన్నకోడూరు, ఎప్రిల్17,(ప్రజా జ్యోతి); మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంటలకు సరైన గిట్టుబాటు ధర లభిస్తుందని ఆయన తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఉపసర్పంచ్ కన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ నివేదిక తక్షణమే వెంటనే అమలు చేయాలి

### సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి

### టీజీఈజేఏసి సిద్దిపేట జిల్లా కమిటీ డిమాండ్



సిద్దిపేట,ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తెలంగాణ రెండో పీఆర్సీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం పీఆర్సీ గడువు పొడిగించకుండా, వెంటనే నివేదిక తెప్పించుకుని సంఘాలతో చర్చించి అమలు చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సిద్దిపేట జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం మధ్యాహ్న సమయంలో కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఈజెఏసి సిద్దిపేట జిల్లా నాయకులు గ్యాదరి పరమేశ్వర్ , విక్రం రెడ్డి, తప్పెట్ల యాదగిరి , ఇంద్రసేనారెడ్డి, తిరుపతి రెడ్డి లు మాట్లాడుతూ 2024 మార్చి నుండి రిటైర్ అయిన 12 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఏక మొత్తంగా 13000 కోట్లు కేటాయించి పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేయాలి డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రధానమైన పై నాలుగు సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే మే 5వ తేదీన రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నిరసన ప్రదర్శనలో ఉద్యోగ ఉపాధ్యాయులు పెన్షనర్ పాల్గొన్నారు. నిరసన ప్రదర్శన అనంతరం జాయింట్ కలెక్టర్ లక్ష్మి కిరణ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగరాజు, రంగారావు, తిరుపతి రెడ్డి, కిష్టయ్య, కాజా, శశిధర్ శర్మ, నరేందర్, సుశాంత్, దేవరాజ్, పొన్నమల్ల రాములు, రాజు రెడ్డి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిబంధనలపై చైతన్యం అవసరం



మొదటి పేజీ తరువాయి..

చేపడుతుండగా,ఈ కార్యక్రమ లక్ష్యాలు ప్రతి ఒక్కరికి చేరాలన్నారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టగా, రోడ్డు భద్రత కమిటీలతో క్షతగాత్రులకు త్వరితగతిన వైద్య సహాయం అందించే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రోడ్డు నిబంధనలు ఉల్లంగించడం,హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం తదితర అంశాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాలు తగ్గించడం కార్యక్రమ లక్ష్యమన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, అయితే రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్ద చనిపోతే ఆ





కుటుంబం కోలుకోదన్నారు.మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా,రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే చక్కటి ఫలితాలు వస్తాయని చెప్పారు. ముఖ్యంగా ఓవర్టేక్ చేసే సందర్భంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎదుటివారు తప్పు చేసినా ఫలితం అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ట్రైనీ ఐపీఎస్ అయేషా ఫాతిమా,ఏసిపి నర్సింలు, ఆర్డిఓ చంద్రకళ,రూరల్ సీఐ రవిరాజు,జగదేవ్ పూర్ ఎస్సై కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలు పట్టని వ్యవసాయ శాఖ

మొదటి పేజీ తరువాయి..

ఆరోపిస్తున్నారు. పీఎం కిసాన్, రైతు భరోసా, రైతు బీమా వంటి ప్రభుత్వ పథకాల అమలు సక్రమంగా జరగకపోవడంతో అర్హులైన రైతులు లబ్ధి కోల్పోతున్న పరిస్థితి నెలకొంది.

### ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధికారిక వివరాలు

వ్యవసాయ అధికారుల వద్ద ఉండాల్సిన అధికారిక ఫోన్ నంబర్లు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉండటం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. దీనివల్ల రైతుల వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతాల వివరాలు భద్రత కోల్పోయే ప్రమాదం ఉందని పలువురు అంటున్నారు.

### అప్డేట్ కాని పీఎం కిసాన్ జాబితాలు

గత రెండేళ్లుగా పీఎం కిసాన్ లబ్ధిదారుల జాబితా అప్డేట్ చేయకపోవడం వల్ల కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు నమోదు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎన్నిసార్లు కార్యాలయానికి వెళ్లినా స్పందన లేదని చెబుతున్నారు.

### రైతు వేదికల వద్దే జీవ ఎరువులు

ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాల్సిన జీవ ఎరువులు, వేప నూనె



రైతులకు అందకుండానే రైతు వేదికల వద్ద నిల్వ ఉండటం విమర్శలకు తావిస్తోంది. సీజన్ ముగిసేలోపు పంపిణీ చేయకపోతే పంటలకు నష్టం తప్పదని రైతులు అంటున్నారు.

### రైతుల ఆవేదన

ముబారాస్పూర్ గ్రామానికి చెందిన రైతు కోటి రాజు మాట్లాడుతూ...పీఎం కిసాన్ కోసం సంవత్సరం క్రితం దరఖాస్తు చేసుకున్నాను. నాలుగు సార్లు పత్రాలు సమర్పించినా నా పేరు జాబితాలో చేర్చలేదు. అధికారులపై చర్యలు తీసుకోవాలి అని కోరారు.

అదే గ్రామానికి చెందిన బొక్క శ్యామల మాట్లాడుతూ ,నేను దివ్యాంగురాలిని. రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నాను. పలుమార్లు పత్రాలు ఇచ్చినా ఇప్పటికీ డబ్బులు రావడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి

వ్యవసాయ శాఖలో నెలకొన్న నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతులకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## అక్షర హాస్పిటల్పై చర్యలు తీసుకోవాలి

## సీపీఎం పార్టీ డిమాండ్

కొమురవెల్లి, ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి):- చేర్యాల పట్టణంలోని అక్షర హాస్పిటల్ యజమాని డాక్టర్ ఎడవల్లి సంతోష్ కుమార్పై చట్టపరమైన చర్యలు తీసుకుని హాస్పిటల్ను సీజ్ చేయాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొమురవెల్లిలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.చేర్యాల ప్రాంతంలో అక్షర హాస్పిటల్ నిర్వహణలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మెడికల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ సంతోష్ కుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి అండదండలతో ఆర్ఎంపీ డాక్టర్లను వేధిస్తూ, వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో తనపై వచ్చిన ఆరోపణలు నిరూపితమైతే హాస్పిటల్ను మున్సిపాలిటీకి స్వచ్ఛందంగా అప్పగిస్తానని డాక్టర్ సంతోష్ కుమార్ ప్రకటించారని గుర్తుచేశారు. ప్రస్తుతం అవినీతి ఆరోపణలు బయటపడిన నేపథ్యంలో ఆయన తన మాట నిలబెట్టుకుని అక్షర హాస్పిటల్ను మున్సిపాలిటీకి రాసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, ఆరుట్ల రవీందర్, సున్నం యాదగిరి, కానుగుల రాజు, చింతల అజయ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## రైతు మార్కెట్ ను పున:ప్రారంభిస్తాం

చిన్నకోడూరు, ఎప్రిల్16,(ప్రజాజ్యోతి): మండల కేంద్రంలో మూతపడిన రైతుబజార్ను మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బజార్లో ఉన్న సదుపాయాలు, సమస్యల గురించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు మరియు వినియోగదారులకు ఉపయోగపడే విధంగా రైతు బజార్ను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. బజార్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి త్వరలోనే రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. రైతులు నేరుగా తమ పంటలను విక్రయించుకునే అక్షయపాత్ర రైతు బజార్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు అందుకున్న నిమ్మ నితిన్



మిరుదొడ్డి, ఏప్రిల్ 17, (ప్రజా జ్యోతి ): డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన నిమ్మ నితిన్కు దళిత రత్న అవార్డు లభించింది. సమాజంలో పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న నితిన్కు ఈ అవార్డు రావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా దళితుల సంక్షేమం, విద్యా అభివృద్ధి, యువతకు మార్గనిర్దేశం చేయడంలో ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ, ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను కల్పించిందని, భవిష్యత్తులో కూడా సమాజ సేవలో ముందుండి పని చేస్తానని అన్నారు.

# కాకతీయలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

సిద్దిపేట రూరల్,ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి): జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిస్మాట్(బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ)స్టేట్ జనరల్ సెక్రెటరీ జగ్గ మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలతో పాటు సంస్కృతి సంప్రదాయాన్ని ప్రతిబింబింపజేసే కార్యక్రమాలు చేయడం అభినందనీయమని తెలిపారు. ప్రైమరీ విద్యార్థులకు



ఉత్తీర్ణత సాధించినట్లు సర్టిఫికెట్స్ అందజేసి, వారిలో ఉత్తేజాన్ని నింపడంతో పాటు, ఒక గుర్తింపుని ఇవ్వడం సంతోషదాయకం అన్నారు. చిన్ననాటి నుండి విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని, పురాణ ఇతిహాసాలను పరిచయం చేయాలని, మహనీయుల అడుగుజాడల్లో పయనించే విధంగా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్య నేర్పిన గురువులకు, చదువుకున్న పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తేవాలని విద్యార్థులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో



పాల్గొన్నారు.



# ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సమస్యలు పరిష్కరించాలి



మిరుదొడ్డి, ఏప్రిల్ 17, (ప్రజా జ్యోతి ) : తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఖీఎఉఒఅఇ) పిలుపు మేరకు అక్బర్పేట భూంపల్లి, మిడిదొడ్డి మండల కేంద్రాల్లో తహసిల్దారులకు వినతి పత్రాలు సమర్పించారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగుల ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ ఏర్పడి 30 నెలలు పూర్తవుతున్న నేపథ్యంలో 51% ఫిట్మెంట్తో 2వ పీఆర్సీని అమలు చేయాలని, జూన్ 2లోపు నివేదికను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్లో ఉన్న రూ.13,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసి పెన్షనర్ల ఇబ్బందులను తొలగించాలని తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్య కార్డులు, కొత్త ఉఏఖి విధానాలను త్వరగా అమలు చేయాలని, ఇఖి రద్దు చేసి ㅊఖి పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఫ్, పి ఆర్ టీ యూ, యూ టీ ఎఫ్, ఎస్ టి యూ, టీ పి యు ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# బాధలో ఉన్న కుటుంబానికి పరామర్శ

### పది వేల ఆర్థిక సహాయం

వర్గల్,ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి): వర్గల్ మండల కేంద్రంలో మృతి చెందిన పత్తి శోభ కుటుంబానికి సిద్దిపేట జిల్లా శైవ లింగాయత్ లింగ బలిజ సమాజం ప్రతినిధులు శుక్రవారం నాడు పరామర్శించారు.ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమాజం అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ ప్రతినిధులతో కలిసి వెళ్లి సంతాపం తెలిపి, వారి కుటుంబానికి ఆర్థిక సాయంగా పదివేల రూపాయలు అందించారు. పరామర్శించిన వారిలో వర్గల్ మండల వీరశైవ సమాజం గౌరవాధ్యక్షులు జంగం వీరభద్రయ్య , లింగాయత్ సమాజం మండల అధ్యక్షులు ఇమ్మడి



లింగప్ప , వీరశైవ సమాజం జిల్లా నాయకులు నాయకులు కోరే వీరాంజనేయులు, బలిజ నాగరాజు, సిలువేరు శ్రీనివాస్, బొలగం పూర్ణచందర్ లు ఉన్నారు.

# పోషకాహారం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యం



## సీడీపీఓ ఎల్లయ్య

దౌల్తాబాద్, ఏప్రిల్ 17: (ప్రజా జ్యోతి) ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పోషకాహారం ఎంతో కీలకమని దుబ్బాక సీడీపీఓ ఎల్లయ్య పేర్కొన్నారు. దౌల్తాబాద్, ఇందుప్రియాల్ సెక్టార్ పరిధిలోని దౌల్తాబాద్, తిర్మలాపుర్ అంగన్వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భంలో శిశువు ఎదుగుదల నుంచి జననం అనంతరం పిల్లల పెరుగుదల వరకు సరైన పోషకాహారం అందించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య ఆహారం అందించడం ఎంత ముఖ్యమో వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం పలు ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేస్తున్నాయని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా రోజువారీ కూలీల కుటుంబాల్లో పోషణపై తగిన శ్రద్ధ లేకపోవడం గమనించినట్లు పేర్కొన్నారు. అలాంటి కుటుంబాలను ప్రత్యేకంగా గుర్తించి పోషణ మాసోత్సవాల ద్వారా అవగాహన కల్పిస్తూ, అవసరమైన పోషకాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమాజంలో పోషణపై చైతన్యం పెంపొందించడం ద్వారా ఆరోగ్యవంతమైన తరాలను నిర్మించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు ముచ్చమఱ్ఱి



అనురాధ రమేష్, బండారు లాలు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు గిరిజా, రేణుకా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల మల్లేశం, ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ,రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుదర్శన్, క్రై జిల్లా కోఆర్డినేటర్ రాజలింగం, బ్లాక్ కోఆర్డినేటర్ భాస్కర్,అంగన్వాడీ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.







## చిన్నకోడూరులో ఉచిత కంటి వైద్య శిబిరం



చిన్నకోడూరు, ఎప్రిల్17,(ప్రజా జ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని వంగ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రెడ్డి సంఘంలో కుండె తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూనిపుణులైన వైద్యులు పాల్గొని, ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారికి తదుపరి చికిత్స కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని వినియోగించుకున్నారు.

## ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



నంగునూరు,ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని శుక్రవారం నాడు మండల కేంద్రమైన నంగునూరు లోని తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు అనంతరం నంగునూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే వేతన సవరణ అమలు చేయాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్ర పార్థసారథి, రామస్వామి, కత్తుల రాంరెడ్డి, ఒగులం రాజిరెడ్డి, చాలా వీరారెడ్డి,వీరేశం, పొన్నమల్ల హరికృష్ణ, దేవులపల్లి నర్సింలు, గడీల శ్రీకాంత్, బాలకిషన్, సత్తయ్య, నాగయ్య, శ్రీనివాస్, విజయ్ కుమార్, బొజ్జ చంద్రకాంత్, నోముల లింగం, జయపాల్ యాదవ్, శ్రీనివాస్, పరశురాములు, చిప్ప దత్తాద్రి, మెరుగు వెంకటి, పంతం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి

ములుగు,ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి) ఉపాధ్యాయ మరియు వివిధ సంఘాల ఉద్యోగుల డిమాండ్ల సాధనకై రెండవ పి ఆర్ సి అమలు,పెండింగ్ బిల్లుల చెల్లింపు,ఉఏఖి పథకం అమలు మరియు సి పి ఎస్ ను రద్దుచేసి ఓపిఎస్లు పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం నిరసన తెలుపుతూ ములుగు తహసిల్దార్ రవీందర్ రెడ్డి కి మెమొరాండం ఉద్యోగ సంఘాల నాయకులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు ములుగు మండల అధ్యక్షుడు శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్ష శ్రీనివాస్ రెడ్డి,వెంకట్ నర్సిరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,రామ్ నర్సయ్య గౌడ్,ములుగు మండల సొసైటీ అధ్యక్షుడు భార్గవరెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,వెంకట్ రెడ్డి,రాష్ట్ర సెక్రటరీ శ్రీనివాస్ చారి,జిల్లా ఉపాధ్యక్షురాలు రాధిక,మండల శాఖ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,హై స్కూల్ హెడ్మాస్టర్



రవికుమార్,శ్రీలత సీనియర్ నాయకులు,ప్రాథమిక సభ్యులు,ఉపాధ్యాయుని ,ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కెనాల్లో ఈతకు వెళ్లి శవమై తేలిన ప్రకాష్ రాథోడ్




గజ్వేల్ ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి):ఎండ తీవ్రత తట్టుకోలేక పీర్లపల్లి గ్రామంలోని కెనాల్లో ఈత కొట్టేందుకు వెళ్లి శవమై తేలిన ప్రకాష్ రాథోడ్. శుక్రవారం స్థానిక ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. కర్ణాటక రాష్ట్రం,బీదర్ జిల్లాకు చెందిన ప్రకాష్ రాథోడ్ 30 తన బావలు బస్వరాజు పవార్, రామచంద్రం తో కలిసి గురువారం సాయంత్రం సుమారు 3 గంటల సమయంలో తమ పనిమీద బైక్ పై హైదరాబాద్ నుండి సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం, పీర్లపల్లి గ్రామంలోని కెనాల్ వద్దకు వచ్చారు. అక్కడికి చేరుకున్న తరువాత ఎండ తీవ్రంత తట్టుకోలేక ప్రకాష్ రాథోడ్ కెనాల్లో ఈత కొట్టేందుకు ఒక్కడే వెళ్లాడు.కొంత సమయం గడిచిన తరువాత అతను బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన మిగతా ఇద్దరు కెనాల్ వద్దకు వెళ్లి పరిశీలించగా అతను కనిపించలేదు. చుట్టుపక్కల వెతకగా కెనాల్ ఒడ్డున అతని చెప్పులు,బట్టలు వదిలి ఉన్నట్లు గమనించారు.ఈ విషయమై అతని బావ బస్వరాజు పవార్ జగదేవపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, నిన్నటి నుండి కెనాల్లో గాలించగా, శుక్రవారం ఉదయం సుమారు 8 గంటలకు పీర్లపల్లి కెనాల్ గేట్ల వద్ద ప్రకాష్ రాథోడ్ శవమై కనిపించినాడు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించడం జరిగిందని తెలిపారు.స్థానిక ఎస్సై కృష్ణారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## అమరుల ఆత్మలు ఘోషించేలా

# బిజెపి ఎంపీ వ్యాఖ్యలు

### మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

### తెలంగాణా పై విషం చిమ్ముతున్న బీజేపీ ఎంపీలు



తొగుట, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి): తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలతో తెలంగాణ పోరాటంలో అమరులైన వారి ఆత్మలు ఘోషిస్తున్నాయని తొగుట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిండు పార్లమెంటు సాక్షిగా ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ విభజన భారత్ నుండి పాకిస్తాన్ ను విభజన చేసిన విధంగా పోల్చడంపై ఆయన మండిపడ్డారు. తెలంగాణ గురించి ఏం తెలుసని తేజస్వీ సూర్య మాట్లాతున్నాడని, తెలంగాణ కోసం నాడు ఎల్ కే అద్వానీ, సుష్మాస్వరాజ్ లు మద్దతివ్వగా, నేటి తరం ప్రధాని మోదీ నుండి మొదలుకొని అమిత్ షా , నేటి తేజస్వీ సూర్య వరకు తెలంగాణకు వ్యతిరేకంగా విషం చిమ్ముతున్నారని ఆయన విమర్శించారు. తేజస్వీ సూర్య తెలంగాణ ఏర్పాటుపై విమర్శలు చేస్తుండగా, తెలంగాణ నుండి ప్రాతినిధ్య వహిస్తూ తెలంగాణ ఆత్మను ప్రతిభింభించాల్సిన బీజేపీ కి చెందిన 8 మంది ఎంపీలు ఉత్సవ విగ్రహాల్లా స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. తమిళనాడుపై తేజస్వీసూర్య ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుండగానే పార్టీలకతీతంగా అక్కడి ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ అడ్డుకున్నారని, వారికి ఉన్న రేషం, చేవ మన ఎంపీలకు లేదా అని ప్రశ్నించారు. గతంలో సైతం బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ప్రధాని మోదీ కర్ణాటక, ఆంధ్ర సభలలో తెలంగాణ ఏర్పాటు తలుపులు దగ్గర పెట్టి చేశారని, తల్లిని చంపి బిడ్డను బతికించారని తెలంగాణకు వ్యతిరేకంగా విషం కక్కారన్నారు. దేశంలో ఎన్నో సమస్యలుండగా తెలంగాణ పై ఏడ్వడం ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రం కాదని, 1948 లోనే హైదరాబాద్ రాష్ట్రం ఏర్పడగా, బలవంతంగా ఆంధ్రలో కలిపిన విషయం తెలుయదా అని ఆయన ప్రశ్నించారు. కొత్తగా ఏర్పడిన తెలంగానకు బీజేపీ ప్రభుత్వం చేసిందేమి లేదని, ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని, మెడికల్ కళాశాలను కూడా మంజూరు చేయలేదని, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు సహకారం అందించలేదని ఆయన విమర్శించారు. అధికార పక్షంలో ఉండి తెలంగాణ విభజనపై నోరు పారేసుకొనే బదులు విభజన సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. రెండు కళ్ల సిద్ధాంత కర్త చంద్రబాబుకు తొత్తుగా బీజేపీ నాయకులు పనిచేస్తున్నారని సీనియర్ నాయకులు చిలువేరి మల్లారెడ్డి మండిపడ్డారు. 60 ఏళ్ల పోరాటంతో ఎంతో మంది అమరుల త్యాగాలతో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించుకోవడం జరిగిందన్నారు. తేజస్విసూర్య అవమాన కరమైన వ్యాఖ్యలు చేస్తుంటే తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు ఎందుకు నోరు మెదుప లేరని, కాంగ్రెస్ ఎంపీ లు ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్ లో బిఆర్ఎస్ ఎంపీ లు ఉంటే అగ్గి రాజేసేవారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజిరెడ్డి, నాయకులు బోధనం కనకయ్య, సుతారి రమేష్, కుర్మ యాదగిరి, బండారు స్వామిగౌడ్, అరుణ్ కుమార్, బిక్షపతి, రాంబాబు, జహంగీర్, అంజియాదవ్, నవీన్ తదితరులున్నారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం

### పబ్బ కుటుంబం సేవా కార్యక్రమం

దౌల్తాబాద్ ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి): ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతినెల అమావాస్య సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమం ఈనెల కూడా ఘనంగా నిర్వహించారు. కీర్తిశేషులు పబ్బ శంకరయ్య స్మారకార్థం ఆయన కుమారులు పబ్బ ప్రభాకర్, పబ్బ అశోకు గుప్తా లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులకు, అవసరమైన భోజనాన్ని అందజేశారు. సేవా భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. తమ తండ్రి జ్ఞాపకార్థం సమాజానికి సేవ చేయడం తమకు ఆనందాన్ని కలిగిస్తోందని పబ్బ ప్రభాకర్, అశోకు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినెల అమావాస్య రోజున ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సామాజిక సేవలో ముందంజలో నిలుస్తోంది. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా జిల్లా ఆర్య వైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు పబ్బ మాధవి సిద్దిపేట జిల్లా పిఆర్ఓ శ్రీరామ్ ప్రణవి దౌల్తాబాద్ మండల మహిళ అధ్యక్షురాలు పసుపు నూరి పద్మ, ఆర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.








## దొంగను అరెస్టు చేసి రూ.50,000 నగదు, సెల్ఫోన్ లు స్వాధీన పరుచుకున్న పోలీసులు

ములుగు,ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి)మండల పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ బహిలింపూర్ గ్రామంలో గత నెలలో బొల్లు వెంకటేశం ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లో చొరబడి 150000 నగదు,అదే గ్రామానికి చెందిన పసుల సత్తయ్య ఇంట్లో చొరబడి 65 వేల నగదు,3 తులాల వెండి,సెల్ ఫోను ఎత్తుకెళ్లారని పోలీస్ స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన ఎస్సై రఘుపతి దర్యాప్తులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం వచ్చిన సమాచారం మేరకు ములుగు బస్టాండ్ వద్ద ఒక వ్యక్తి అనుమాన స్పదంగా తిరుగుతున్నాడు అని తెలిసి వెంటనే అక్కడికి వెళ్లి వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా మేడ్చల్ జిల్లా, షామీర్పేట మండలం, తుర్కపల్లి తండా కు చెందిన అప్పావత్ శ్రీకాంత్ గత నెలలో జరిగిన దోపిడీ కేసులో దొంగతనం చేసినట్లు అంగీకరించగా అతని వద్ద 50వేల నగదు సెల్ ఫోను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.దొంగను అరెస్టు చేసిన ఎస్సై,సిబ్బంది గౌరారం సిఐ రవిరాజు అభినందించారు.

## పోచమ్మ గుడి నిర్మాణానికి పూసల సంఘం విరాళం



దౌల్తాబాద్ ఏప్రిల్ 7(ప్రజా జ్యోతి ): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించబడిన పోచమ్మ గుడి అభివృద్ధికి దౌల్తాబాద్ పూసల సంఘం తరపున రూ.5,051 విరాళంగా అందజేశారు. గ్రామ దేవాలయాల అభివృద్ధి పట్ల తమ బాధ్యతగా భావించి ఈ విరాళం అందజేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు సామాజిక ఐక్యతకు కేంద్రబిందువులుగా నిలుస్తాయని, అందువల్ల వాటి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. చిన్నచిన్న విరాళాలు కూడి పెద్ద సేవగా మారుతాయని, ఇలాంటి కార్యక్రమాలు గ్రామ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.పోచమ్మ గుడి నిర్మాణం పూర్తికావడంతో గ్రామ ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గుడి అభివృద్ధి కోసం స్థానికులు, సంఘాలు ముందుకు రావడం అభినందనీయమని గ్రామ పెద్దలు అన్నారు. ఈ కార్యక్రమంలో పూసల సంఘం సభ్యులు, కుమ్మరి సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



గజ్వేల్ ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి):ఉద్యోగ ఉపాధ్యాయుల హక్కుల సాధన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేఏసీ ఆధ్వర్యంలో జగదేవపూర్ తహశీల్దార్ నిర్మల కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.ఈజీఈజేఏసి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉద్యోగ ఉపాధ్యాయుల హక్కుల సాధన,సమస్యల పరిష్కారం కొరకు మండల తహశీల్దార్ నిర్మల కి వినతిపత్రం సమర్పిస్తున్న పి ఆర్ టి యు టి ఎస్ జగదేవపూర్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు చిలుకూరి వెంకట్రాంరెడ్డి,బొద్దు నాయక్, టిపిటిఎఫ్ అధ్యక్షులు సత్తయ్య, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి పరుశరాములు,ఎస్ జిటి అధ్యక్షులు వెంకటేశ్వర్లు, పిఆర్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు భగవాన్ రెడ్డి, హరికిషన్, రాజు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్లో సర్పంచ్ ఆకస్మిక తనిఖీ

### భోజన నాణ్యత, విద్యా స్థితిపై సమగ్ర సమీక్ష

### సర్పంచ్ ముచ్చుమరి అనురాధ రమేష్

దౌల్తాబాద్ ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి ): గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో సర్పంచ్ ముచ్చుమర్రి అనురాధ రమేష్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి, ఆహార నాణ్యత, పోషక విలువలు, వంటశాలలో పాటిస్తున్న శుభ్రత ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించారు.ఆహారం తయారీ విధానం,



వంటగది పరిశుభ్రత, పాత్రల శుభ్రత, నిల్వ విధానాలను కూడా పరిశీలించి సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న భోజనం నాణ్యత, రుచి, పరిమాణంపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులు తమ అభిప్రాయాలను తెలియజేయగా, సర్పంచ్ వాటిని గమనించి మరింత మెరుగుదల కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా తరగతి గదులను సందర్శించి విద్యార్థుల చదువుల స్థితిగతులు, ఉపాధ్యాయుల బోధన విధానాలను సమీక్షించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తు బలంగా ఉండాలంటే నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం అందించడం అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు.పాఠశాల అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక వసతులు, అదనపు సదుపాయాలపై



గ్రామపంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని, అందుకు సమాజం మొత్తం బాధ్యత వహించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ , ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, వార్డు సభ్యులు అల్వాల వంశీ, తూర్పు శ్రీకాంత్, ముక్కెర రేణుక నర్సింలు, పాపగౌని ప్రవీణ్ గౌడ్, కేంసారం నాగరాజు, తలారి నవనీత ఏసు, జీర్కపల్లి ఇంద్ర నర్సింలు, జాలిగామ సులోచన శివకుమార్, కర్రోళ్ల రజిత మల్లేశం, జీర్కపల్లి నాగమణి నర్సింలు, విస్లావత్ లక్ష్మీ చందర్, మాజీ 7వ వార్డ్ మెంబర్ పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.





### ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై

## టీజీ జేఏసీ నిరసన

### తహసీల్దార్ కు వినతిపత్రం అందజేత

దౌల్తాబాద్ ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి )టీజీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయం ముందు మండల స్థాయి నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం తమ సమస్యలను వివరిస్తూ తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పలు కాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల హక్కులు పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీజీ జేఏసీ నాయకులు రాజిరెడ్డి, సుధాకర్ రెడ్డి, రవీందర్, శ్రీధర్, వెంకటేశం, వేణుగోపాల్, చందు, యాదగిరి, దశరథం, వెంకట్ రెడ్డి, రాజశేఖర్, బాపు స్వామి, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉప్పరపల్లి సబ్ కెనాల్‌కు నీళ్లు రాక ఎండిన పొలాలు



దౌల్తాబాద్ ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి ) : మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన రైతు చిదుగు శివకుమార్ గౌడ్కు చెందిన నాలుగు ఎకరాల పంట పొలం నీటి లేమితో ఎండిపోయింది. గ్రామానికి చెందిన ప్రధాన కెనాల్కు అనుబంధంగా ఉన్న సబ్ కెనాల్కు సమయానికి నీరు అందకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది.రైతు శివకుమార్ గౌడ్ తన పొలంలో పంట సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టినా, నీటి కొరత కారణంగా పంట పూర్తిగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి కెనాల్కు తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సబ్ కెనాల్ సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## పారిశుద్ధ్య కార్మికుల నిధులు విడుదల చేయాలి

సిద్ధిపేట, ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ టీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లు గారి ఇంద్రసేనారెడ్డి, ఆదరాసుపల్లి శశిధర శర్మ కోరారు. ఈ మేరకు వారు జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాసరెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో పరిశుభ్రతను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి విద్యా సంవత్సరం పది నెలలకు పారిశుద్ధ్య గ్రాంట్ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మంజూరు చేస్తోందన్నారు. సిద్దిపేట జిల్లాలో గత విద్యా సంవత్సరంలో 10 నెలలకు కేవలం ఆరు నెలలు చెల్లించారని చెప్పారు. ప్రస్తుత సంవత్సరానికి 10 నెలలకు ఏడు నెలలకు మాత్రమే నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. పాఠశాలల ఇబ్బందుల దృష్ట్యా గత విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగు నెలల బకాయిలు, ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి మూడు నెలల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు సరైన సమయానికి ఇవ్వక పోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు.

## ఉపాధి హామీ కూలీలకు వసతులు కల్పించాలి

### తిప్పారపు శ్రీనివాస్ సీపీఎం మండల కార్యదర్శి



బెజ్జంకి ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి): ఎండ తీవ్రత అధికంగా ఉన్నపటికీ, మండలంలోని అన్ని గ్రామాల కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తు న్నారని సీపీఎం మండల కార్య దర్శి తిప్పారపు శ్రీనివాస్ పేర్కొన్నా రు. ఎండాకాలం తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, పని ప్రదేశంలో కూలీల కు చల్లని త్రాగునీటి సౌకర్యం, నీడ కోసం టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య కిట్లు, పని ప్రదేశాలకు రవాణా సౌకర్యం కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని సీపీఎం పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తునట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి విభిజీరాంజీ పథకాన్ని తీసుకొచ్చిందని, ఈ పథకం వల్ల ఉపాధి హామీ కూలీలకు తీవ్ర నష్టం జరుగుతుందని, కూలీల అనేక నిబంధనలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూలీలకు ఫోటోలు, ఐరిస్ రావడం లేదంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కూలీ డబ్బులు కూడా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## గాగిల్లాపూర్ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



బెజ్జంకి ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి): మండలంలోని గాగిల్లాపూర్ గ్రామం లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా బొమ్మరవేణి వెంకటేష్, ఉపాధ్యక్షు లుగా రాగి రవి, కోశాధికారిగా బొమ్మరవేణి బాలమల్లు, ప్రధాన కార్యదర్శిగా బొమ్మరవేణి ఎల్లయ్య, కార్యదర్శులు బొమ్మరవేణి సంపత్, రాగి హరీష్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్బంగా నూతన అధ్యక్షులు బొమ్మరవేణి వెంకటేష్ సంఘ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, తన నియామకానికి సహకరించిన సంఘ సభ్యులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# లయన్స్ క్లబ్ చేయూత అభినందనీయం




### భవాని నవీన్ కుమార్, రామంచ సర్పంచ్




చిన్నకోడూరు, ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి):సిద్దిపేట లయన్స్ క్లబ్ సేవలుఅభి నం దనియమని సర్పంచ్ భవాని నవీన్ కుమార్ అన్నారు. వేసవి కాలంలో విద్యార్థులకు పండ్ల రసాలు, శక్తిని ఇచ్చే పానీయాలను లయన్స్ క్లబ్ ప్రతినిధులు అందచేశారు. శుక్రవారం చిన్న కోడూరు మండలం రామంచ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రధానో పాధ్యాయుడు యాంసాని వెంకట సురేశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యక్రమంలో ఏఏపీసి చైర్ పర్సన్ ప్రేమలతతో కలిసి సర్పంచ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ భవాని నవీన్ కుమార్ మాట్లాడుతూ ఐదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి, ఉన్నత చదువులు చదువుకుంటే కలిగే లాభాలను వివరించి, విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని పెంపొందించడం ఒక మంచి పరిణామం అన్నారు. రామంచ పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చేస్తున్న కృషికి తాము సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. లయన్స్ క్లబ్ వారు అందిస్తున్న చేయుతకు నిరంతరం రుణపడి ఉంటామన్నారు. పాఠశాల విద్యార్థులకు తమ కుమారుని పుట్టిన రోజు సందర్భంగా చికెన్ వంటకాన్ని అందించిన విద్యార్థుల తల్లిదండ్రులు రేణుక నరేష్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, ఆబెద బేగం నాగమణి, వరప్రసాద్, యాదయ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయకుంటే ఉద్యమమే

### రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షులు అయిలేని మల్లికార్జున రెడ్డి



బెజ్జంకి ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి): రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయని యెడల ఉద్యమం చేపడతామని సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి అన్నారు. ఈనెల 21న రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో జరిగే ధర్నాకు తరలిరావాలని, రెడ్డి జేఏసీ మండలాధ్యక్షులు ముక్కిస తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని గుగ్గిళ్ల, గాగిల్లాపూర్, దేవక్కపల్లి గ్రామాల్లో కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయిలేని మల్లికార్జున రెడ్డి మా ట్లాడుతూ, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపడితే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై, రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఇచ్చిన మాట నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం రాగానే, రెడ్డిల్లో నిరుపేదలు కనబడటం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నెరవేర్చే వరకు మా పోరాటం ఆగదని తెలిపారు. ఈనెల 21న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు రెడ్డి బాంధవులందరు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జెఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పన్యాల విష్ణువర్ధన్ రెడ్డి, రెడ్డి జెఏసి బెజ్జంకి మండల అధ్యక్షులు ముక్కిస తిరుపతి రెడ్డి, జేఏసీ నాయకులు హనుమాండ్ల లక్ష్మారెడ్డి, నారెడ్డి సుదర్శన్ రెడ్డి, దుం బాల రాజ మహేందర్ రెడ్డి, ఐలేని శ్రీనివాస్ రెడ్డి, అయిలేని మల్లారెడ్డి, నర్సింహా రెడ్డి, పార్తివ రెడ్డి, గూడ పద్మా రెడ్డి, అయిలేని గాల్ రెడ్డి, చంద్రా రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజిరెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల త్యాగాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి

### ఎంపీ తేజస్వీ సూర్యను వెంటనే బర్తరఫ్ చేయాలి

### సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్



బెజ్జంకి ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని బిజెపి దెబ్బతీస్తుండగా, ఆ పార్టీ ఎంపీ తేజస్వి సూర్య ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్ తో పోల్చడం సిగ్గుచేటని సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బెజ్జంకి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ అమరుల త్యాగాలను కించపరిచే విధంగా ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడినప్పటికీ ఆ పార్టీ తెలంగాణ ఎంపీలు అడ్డుకోకపోవడం వారి నైజాౕ బయటపడిం దన్నారు. దేశంలో మూడు రాష్ట్రాలను ప్రకటించిన బిజెపి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఎన్నో అడ్డంకులు సృష్టించిందని, ఇక్కడి ప్రజల ఆగ్రహానికి గురవుతామనే భయంతో వెనకడుగు వేసిందని తెలిపారు. తెలంగాణలో 1200 మంది యువకుల ఆత్మబలిదానాలకు బిజెపి, కాంగ్రెస్ పార్టీలే కార ణం కాగా, ప్రజా ఉద్యమా లతో మాత్రమే యూపీఏ ప్రభుత్వం దిగివచ్చి తెలం గాణ రాష్ట్రాన్ని ప్రకటించి నట్లు గుర్తు చేశారు. యువ కుల బలిదానాలను కించపరి చిన బీజేపి ఎంపీ తేజస్వి సూర్యను వెంటనే భర్తరఫ్ చేసి,ఆ పార్టీ తెలం గా ణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలంగాణ ప్రజ ల ఆగ్రహానికి బిజెపి గురి కాక తప్పదని హెచ్చరించారు.

## ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకుల డిమాండ్



బెజ్జంకి ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో, మండలంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం తహశీల్దార్ కె.శ్రీకాంత్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెండింగ్ లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే మంజూరు చేయాలన్నారు. నూతన వేతన సవరణను వెంటనే చేపట్టాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబందించిన సాధారణ బదిలీలు చేపట్టాలని, న్యాయపరమైన ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఎంపీడీఓ కడవేర్గు ప్రవీణ్, వెంకటరమణ రెడ్డి, ఎం.రమేష్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రవీణ్ కుమార్, శ్రీరామ్ శ్రీనివాస్, తప్పేట ఓదయ్య, రామంచ రవీందర్, వడ్లకొండ శ్రీనివాస్, రేకులపల్లి నర్సింహారెడ్డి, నారోజు శంకరా చారి, జొంగోని శ్రీనివాస్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు వెంటనే అమలు చెయ్యాలి



గజ్వేల్, ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి):సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లును వెంటనే చెల్లించాలని గజ్వేల్ తాలూకా ట్రెజరర్ ప్రవీణ్, జిల్లా టిఎన్జీవో వైస్ ప్రెసిడెంట్ నాగభూషణం వెంకట్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర జేఏసీ పిలుపుతో గజ్వేల్ ఐఓసీ కార్యాలయం వద్ద ఉద్యోగులు మధ్యాహ్న భోజన విధాన సమయంలో నిరసన చేపట్టారు.పెండింగ్ బిల్లులు చెల్లించాలని, 2వ పీఆర్సీ అమలు చేయాలని,బకాయి డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.సీపీఎస్ రద్దు, హెల్త్ కార్డుల సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వానికి ఘాటు హెచ్చరికలు చేశారు. హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ తాలూకా ట్రెజరర్ ప్రవీణ్, జిల్లా టిఎన్జీవో వైస్ ప్రెసిడెంట్ నాగభూషణం వెంకట్ టిఎన్జీవో జిల్లా మహిళా విభాగం నుండి జబినా సుల్తానా,టి ఎన్ జీవోఓ ఇతర నాయకులు జిల్లా పెన్షనర్ల సంఘసహా అధ్యక్షులు రాజేష్,గజ్వేల్ పెన్షనర్ సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి రామకృష్ణ రెడ్డీ, రాష్ట్ర నాయకులు ఏ మల్లికార్జున్ అన్ని ఉపాధ్యాయ సంఘాలు పాల్గొనడం జరిగింది. నిరసన కార్యక్రమం అనంతరం గజ్వేల్ తహశీల్దార్ కి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ ట్రెజరర్ ప్రవీణ్, జిల్లా టిఎన్జీవో వైస్ ప్రెసిడెంట్ నాగభూషణం, వెంకట్, టిఎన్జీవో జిల్లా మహిళా విభాగం నుండి జబినా సుల్తానా,ఇతర జిల్లా పెన్షనర్ల సంఘం సహా అధ్యక్షులు రాజేష్, గజ్వేల్ పెన్షనర్ సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు,కార్యదర్శి రామకృష్ణ రెడీ సిపిఎస్ రాష్ట్ర నాయకులు ఏ మల్లికార్జున్, అన్ని ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నారు .

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ధర్నా



### తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ గజ్వేల్ అధ్యక్షులు డి.శ్రీనివాసచారి

గజ్వేల్ ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి):సిద్దిపేట జిల్లా గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ నందు తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 1725(ఐ .ఎన్. టి. సి. అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేంద్ర కమిటీ పిలుపు మేరకు దశల వారి ఆందోళనలో భాగంగా నేడు గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రి యందు ఒక్కరోజు ధర్న నిర్వహించడం జరిగింది. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస చారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండవ వేతన సవరణ సంఘం నివేదిక ప్రవేశపెట్టి తొందరగా అమలు చెయ్యాలని డిమైండ్ చేశారు.పాత పెన్షన్,ఓ. పి. ఎస్ విధానము అమలు చేయాలన్నారు.ఉద్యోగులకు రావల సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని అన్నారు.అక్రమ బదిలీలను రద్దు చెయ్యాలి.టైం స్కేల్ ఉద్యోగుల సర్వీసులను కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ లో పనిచేస్తున్న వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు.ఉద్యోగులందరికీ ఈ.ఎస్ ఐ వర్తించుటకు ఉద్యోగులకు 126 జీవో సవరించి అమలు చేయాలి.దీర్ఘ కాలముగా పనిచేస్తున్న ఉద్యోగస్తులకు ప్రమోషన్ కల్పించాలి.జి వో 317 బాధితులకు ఉపశమనం కలిగించుటకు కొత్త జి వో తక్షణమే ను అమలు చేస్తు,న్యూ రిక్రూట్మెంట్ చేయాలి,సిబ్బంది యొక్క పని భారాన్ని తగ్గించాలన్నారు.గతంలో ఎన్నో పర్యాయాలు తమరి దృష్టికి సమస్యల పరిష్కారం కోసం నివేదించినప్పటికీ అమలు అమలు కాలేదు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఒకరోజు ధర్నా నిర్ణయించడం జరిగిందన్నారు.దశలవాదిగా చేపట్టే ఆందోళనలో భాగంగా తొలి దశలో ఆందోళనగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్,వైద్య విధాన పరిషత్ సమస్యలలో ఈరోజు ధర్నాను విజయవంతం చేశామన్నారు. ఉదయం హాజరు సమయంలో రోగులకు అసౌకర్యం కలిగించకుండా నిరసన ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ విమల, ఎఫ్సిబా నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ ,సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ జగదాంబ, వకులాదేవి, నిర్మల, ఉమామహేశ్వరి, ఫార్మసీ ఆఫీసర్స్ మోహన్ బండారి స్వర్ణలత, శిరీష, రమాదేవి, నర్సింగ్ ఆఫీసర్స్ షాహిని ,రశ్మి ,శోభ, రాజు, గౌతమి, హెడ్ నర్సెస్ విమల దేవి, నిర్మల సానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి, నర్సింగ్ ఆఫీసర్స్ పుష్ప, ఉమా, రోజులిన్, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్ ఈ.సీ.జీ. టెక్నీషియన్ రాజు ఆరోగ్యశ్రీ ఇన్చార్జి సురేందర్, సంతోష్ కనకయ్య, హాస్పిటల్ పారామెడికల్ సిబ్బంది,సానిటరీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసినారు.

## సిపిఆర్ తో ఓ నిండు ప్రాణాన్ని కాపాడవచ్చు




గజ్వేల్ ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి): సిపిఆర్ తో ఓ నిండు ప్రాణాన్ని కాపాడవచ్చని డాక్టర్ సమీక్ష మాధవి రచన మైపాల్ సాయి కృష్ణ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల కేంద్రంలోని మహతి ఆడిటోరియంలో శుక్రవారం పోలీస్ కమిషనర్ రేట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మానవ తప్పిదాలతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువవుతున్నాయన్నారు.పల్లె ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలు నివారించి ప్రమాదాలు అరికట్టేందుకు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ...ప్రయాణికులు అతివేగంగా నడపడం,ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం, హెల్మెట్ ధరించకపో వడం వల్ల నిండు ప్రాణాలు రెప్పపాటులో ప్రాణాలు కోల్పోతున్నారని వైద్యులు ఆవేదనను వ్యక్తం చేశారు.ఇలాంటి సమయంలో సంఘటన స్థలం వద్ద ఉన్న ప్రయాణికులు, ప్రమాదానికి గురైన వారికి పరిస్థితుల బట్టి వారికి సిపిఆర్ కార్డియో పల్మనరీ బ్రీతింగ్ అండ్ హార్ట్ బీట్ ఏ విధంగా గుండె విధంగా పనిచేస్తుందో అబ్జర్వేషన్ చేసి కృత్రిమ శ్వాస ఈ విధంగా అందించాలో డెమో ద్వారా కండ్లకు కట్టినట్టు సిపిఆర్ చేసి చూపించారు. ఈ విధంగా చేస్తే ఓ నిండు ప్రాణాన్ని బ్రతికించే వారమవుతామన్నారు.